క్లుప్తంగా

బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు సరికాదు


కర్రి గౌరీసుభాషిణి

పెనుమంట్ర: శాసన సభలో ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యలు సరికాదని జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. రాష్ట్రంలో 40 శాతం పైగా ఓటు బ్యాంకుతో ప్రజాభిమానం చూరగొన్న మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, సినీపరిశ్రమలో ఉన్న సమస్యలను వివరించడానికి జగన్‌ను కలిసిన సినీహీరో, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవిని చులకన చేసి మాట్లాడటం బాలకృష్ణ మానసిక పరిస్థితికి నిదర్శనమన్నారు. ఇలాంటి వ్యక్తులను శాసనసభ నుంచి సస్పెండ్ చేసి, శాసన సభ గౌరవాన్ని కాపాడాలని ఆమె శాసన సభాపతిని కోరారు. శాసన సభలోనే జగనన్నకు బాలకృష్ణ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఫస్ట్ ఎయిడ్ కిట్ల బహూకరణ


మేనేజర్‌కు ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఆర్టీసి బస్సుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం చవాకుల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చవాకుల నరేష్‌బాబు 80 బస్‌లకు ఫస్ట్ ఎయిడ్ కిట్లను శుక్రవారం స్థానిక పొట్టి శ్రీరాములు బస్ స్టేషన్‌లో ఆర్టీసి నరసాపురం డిపో మేనేజర్ సుబ్బన్న రెడ్డి అందజేశారు. దాతను డిపో మేనేజర్ అభినందించారు. కార్యక్రమంలో మాజేటి రాజా, నెలకుర్తి కృష్ణమోహన్, కేవీఎస్‌బీ పవన్, పినిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ చెప్పారు. అజండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామన్నారు. సభ్యులు విధిగా హాజరుకావాలని సూచించారు.

సొసైటీ సమావేశంలో గందరగోళం

పెనుగొండ: ములపర్రు సొసైటీ సమావేశంలో గందరగోళం నెలకొంది. శుక్రవారం ములపర్రు హిందూ ముస్లిం వ్యవసాయ సహకార పరపతి సంఘ అధ్యక్షుడు గుత్తుల లోకేశ్వర రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో బోణం శ్రీను, కేసరపల్లి రమేష్, పీతాని పండు, గుత్తుల రాంబాబు, కుర్తాకుల సుబ్రహ్మణ్యంలు నిధుల వినియోగంపై అనుమానాలు వ్యక్తం చేశారు. కర్వేపాకు చెట్టు తొలగించడానికి తప్పుడు బిల్లులు పెట్టడంతో పాటు, అధికంగా నిధులు డ్రా చేశారని ఆరోపించారు. రైతులకు అందించాల్సిన ధాన్యం సంచులు మాయం అయ్యాయన్నారు. దీనిపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

పీ-4పై సిబ్బందికి శిక్షణ

పెనుగొండ: ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి పీ-4 సర్వేపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ నెల 30లోపు బంగారు కుటుంబాల పూర్తి సమాచారాన్ని తెలుసుకోవాలని ఎంపీడీఓ బి.కృష్ణమోహన్ అన్నారు. ఏఓ పూర్ణబాబ్జి, ఈవోపీఆర్డీ సూరన్న, శ్రీధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పీఎం స్వానిధి రుణాల దరఖాస్తుల స్వీకరణ

తణుకు అర్బన్: తణుకు పురపాలక సంఘం మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం లోక కల్యాణ మేళాను స్థానిక వీకే కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించినట్లు మునిసిపల్ మెప్మా సిటీ మిషన్ మేనేజరు శ్రీనివాస్ తెలిపారు. అర్హత గల వీధి విక్రయదారుల నుంచి పీఎం స్వానిధి మొదటి, రెండు, మూడో విడతలకు సంబంధించి దరఖాస్తులను తీసుకున్నట్లుగా చెప్పారు. మొదటి విడతలో రూ.15 వేలు, రెండవ విడతలో రూ.25 వేలు, మూడవ విడతలో రూ. 50 వేలు రుణాలు మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు. 300పైగా లబ్ధిదారులు కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు. ముందుగా హెల్త్ క్యాంపు నిర్వహించి, డిజిటల్ క్రయ విక్రయాలు ఏవిధంగా చేయాలనే అంశాలపై అవగాహన కల్పించినట్లుగా చెప్పారు.

బ్రాందీ షాపు సీజ్

తాడేపల్లిగూడెం: ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు మద్యం విక్రయిస్తున్న కారణంగా పట్టణంలోని కేఎన్‌రోడ్ రిలయన్స్ సమీపంలో ఉన్న శక్తి వైన్స్‌కు ప్రత్యేక బృందం శుక్రవారం సీజ్ చేశారు. గతంతో రెండు దుకాణాలను సీజ్ చేశారు. దుకాణాల యజమానుల వివరణ అనంతరం, అపరాధ రుసుం చెల్లించాక తిరిగి రెండు దుకాణాలను తెరుచుకొనేందుకు అనుమతి ఇచ్చారు.

రజక జాతి వీరనారి ఐలమ్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): రజక జాతి వీర నారి చిట్యాల ఐలమ్మ ఎన్నో పోరాటాలు చేశారని, రజక జాతి ఐక్యతగా హక్కుల కోసం పోరాడాలని నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక వృత్తిదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అద్దాల నరసింహరావు, రజక చైతన్య సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నాడ శ్రీనివాస్‌లు కోరారు. పట్టణంలో ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం రజక సంఘం నేతలు నిర్వహించారు.

విద్యార్థులకు వరం ఎన్‌ఎంఎంఎస్

- ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహం
- 30 వరకు దరఖాస్తులకు గడువు


గతేడాది ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

యలమంచిలి: ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) అమలు చేస్తోంది. ఈ స్కాలర్‌షిప్ 2025-26వ విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానించింది. దరఖాస్తుల ప్రక్రియ సెప్టెంబర్ 4న ప్రారంభం కాగా ఈ నెల 30 వరకు గడువు ఉంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది.

ఏడాదికి రూ.12 వేలు

ఈ అర్హత పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందిస్తారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు నాలుగేళ్ల పాటు ఈ స్కాలర్‌షిప్ అందుతుంది. నగదు ప్రతి సంవత్సరం విద్యార్థి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. చదువుకోవాలని ఆశ ఉండి పేదరికం, ఆర్థికపరమైన ఇబ్బందులతో విద్యకు దూరమైన విద్యార్థులకు ఈ సాయం ఎంతో ఉపయోపడుతుంది.

అర్హతలివీ..

ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించకూడదు. పాఠశాలలో రెగ్యులర్ విధానంలో చదువుతుండాలి. రాత పరీక్షల ద్వారా స్కాలర్‌షిప్ పొందడానికి విద్యార్థులను ఎంపిక చేస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి ఓసీ, బీసీ విద్యార్థులు పరీక్షల రుసుము రూ.100 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పరీక్ష రుసుం రూ.50 చెల్లించాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ ద్వారా ఉపకార వేతనాలను పొందడానికి మంచి అవకాశం. 8వ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థీ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్షల్లో ప్రతిభ చాటితే నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందిస్తారు. చదువుకు ఆర్థిక పరమైన ఇబ్బందుల్లో ఈ ఉపకార వేతనం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– అవిడి శ్రీవాణి, ఎంఈఓ-1, యలమంచిలి

పరీక్షా రుసుంను ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ కలెక్ట్ లింకు ద్వారా మాత్రమే చెల్లించాలి. దరఖాస్తులను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసే సమయంలో విద్యార్థి ఆధార్ కార్డులో ఉన్న విధంగానే విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేర్లను నమోదు చేయాల్సి ఉంటుంది.

అందుబాటులో లేని కాపవరం సెక్రటరీ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు మండలం కాపవరం గ్రామ సెక్రటరీ విధుల్లోకి రారు. ఫోన్ చేస్తే స్పందించరు. ఒకవేళ స్పందిస్తే ఇష్టానుసారం మాట్లాడతారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదని కాపవరం వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలు క్రితం గ్రామ సెక్రటరీల బదిలీల్లో పెనుమంట్ర మండలం నుంచి రామాంజనేయులు కాపవరం బదిలీపై వచ్చారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వెళితే సెక్రటరీ లేరంటున్నారని ప్రజలు, గ్రామ ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. ఆ అధికారి విధులకు రాకపోవడంతో సచివాలయ ఉద్యోగులు ఏ పనిచేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. లేదంటే రాత్రి సమయంలో ఫోన్ చేసి నువ్వు ఆ పని చెయ్యి, నువ్వు ఈ పని చెయ్యి అని చెప్పి, చేయ్యని వారిపై పెద్దగా అరుపులు కేకలు వేస్తుంటారు. అప్పగించే పనిలో దిశానిర్దేశం లేకపోతే తామెలా చేస్తామని, ఈ సెక్రటరీ వల్ల పని ఒత్తిడి కూడా ఎక్కువవుతోందని సిబ్బంది వాపోతున్నారు. ఈ సెక్రటరీ తీరుపై సచివాలయ సిబ్బంది 10 రోజులు క్రితం ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. అయినా సెక్రటరీ తీరు మారలేదు. ఉన్నతాధికారులు స్పందించి సెక్రటరీని విధుల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీఓ ఉమామహేశ్వరరావును ప్రశ్నించగా, ఆ సెక్రటరీ కుటుంబ వ్యవహారాల్లో ఇబ్బందులు పడుతున్నారని, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మెప్మా కార్యాలయంలో లోక కళ్యాణ్ మేళా


లోక కళ్యాణ్ మేళాలో పాల్గొన్న బ్యాంక్ సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం స్వానిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ బి.విజయసారధి వీధి విక్రయదారులు (చిరు వ్యాపారులు)కు సూచించారు. శుక్రవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మెప్మా భవనంలో లోక కళ్యాణ్ మేళా పీఎం స్వానిధి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయసారధి మాట్లాడుతూ వీధి విక్రయదారులకు ఈ పథకం ద్వారా గతంలో రూ.10 వేలు అప్పు ఇచ్చేవారని, ప్రస్తుతం మరో రూ.5 వేలు పెంచి రూ.15 వేలు ఇస్తున్నారని తెలిపారు. రెండో విడతలో రూ.20 వేలు ఇచ్చేవారని ప్రస్తుతం దానికి మరో రూ.5 వేలు పెంచి రూ.25 వేలు అప్పుగా ఇస్తున్నారని చెపాపరు. వివిధ బ్యాంకుల మేనేజర్లు మాట్లాడుతూ బ్యాంక్‌ల ద్వారా అమలు చేస్తున్న ఇన్సూరెన్స్ పథకాలు వినియోగించుకుని తమ కుటుంబాలకు భద్రత కల్పించుకోవాలని సూచించారు. క్యూఆర్ కోడ్‌తో స్కానర్లను ఉపయోగించుకుని లావాదేవీలు నిర్వహిస్తే భద్రత ఉంటుందన్నారు. కార్యక్రమంలో లేబర్ అధికారి రాజేంద్ర పాల్, మెప్మా మేనేజర్ రత్నాకర్, సిబ్బంది, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరి చెట్లు పేదలకు ఇవ్వాలి


వ్యవసాయ కార్మిక సంఘ మహాసభలో పాల్గొన్న నాయకులు

పెనుగొండ: ప్రభుత్వ పోరంబోకు, మురుగు, పంట కాల్వల గట్లు వెంబడి ఉన్న కొబ్బరి చెట్ల ఫలసాయం పేదలకు స్వాధీనం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాతిరెడ్డి జార్జ్ అన్నారు. శుక్రవారం పెనుగొండ గ్రామ పంచాయతీ వద్ద జరిగిన మహాసభలో మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు పనులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి జీవనోపాధి కోసం ప్రభుత్వ భూముల్లో ఉన్న కొబ్బరి చెట్లను వారికి స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి షేక్ పాదుషా మూడేళ్ల కార్యక్రమాలు నివేదిక ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులుగా పూతినీడి పద్మ, ఉపాధ్యక్షుడిగా మామిడి శెట్టి ఏడుకొండలు, కార్యదర్శిగా కుడుపూడి ప్రసాదు, సహాయ కార్యదర్శిగా షేక్ పాదుషా, కమిటీ సభ్యులుగా కేవీవీ సత్యనారాయణ, కె.నరసింహమూర్తి, కె.నారాయణ, ఏడుగురితో పెనుగొండ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు, మహిళా సంఘం నాయకురాలు జక్కంశెట్టి వెంకటలక్ష్మి, మాదాసు నాగేశ్వరరావు, శీలం ఏసు పాల్గొన్నారు.

అయోధ్యలంక అధ్యక్షుడిగా మానుకొండ


అయోధ్యలంక నూతన కమిటీని అభినందిస్తున్న నాయకులు

పెనుగొండ: వైఎస్సార్‌సీపీ అయోధ్యలంక గ్రామ అధ్యక్షుడుగా మానుకొంట సత్యనారాయణను నియమించినట్లు ఆచంట మండల కన్వీనరు జక్కంశెట్టి చంటి తెలిపారు. శుక్రవారం అయోధ్యలంకలో జరిగిన సమావేశంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సూచనలతో నూతన కమిటీని నియమించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ముప్పాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణానికి 2011లో శిలాఫలకం ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. అయోధ్యలంకలో ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, ముత్యాల నాగేశ్వరరావు, కోటగిరిధర్, బళ్లారి నాగేశ్వరరావు, దొమ్మేటి రాంబాబు, కంచుస్తంభం శ్రీను, గొల్లపల్లి బాలకృష్ణ, కొప్పాడి సత్యనారాయణ, అంకడి పెద్దిరాజు, పైడి వెంకటేశ్వరరావు, వడ్లమూడి శ్రీను, మానుకొండ సూరిబాబు, కప్పల శ్రీనివాస్, గుడాల నాగేశ్వరరావు, వడ్లమూడి రాముడు, బద్దే బుల్లబ్బులు, నక్కా ఆనంద్‌లు పాల్గొన్నారు.

కార్మికులకు పండగ సెలవులు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న తులసీరావు

నరసాపురం: ఆర్టీసీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలతో పాటుగా పండగ సెలవులు ఇవ్వాలని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.తులసీరావు డిమాండ్‌చేశారు. శుక్రవారం స్థానిక మీరా భవనంలో ఆర్టీసీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమావేశం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తులసీరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థగా చెప్పుకుంటున్న ఆర్టీసీలో అనేక ఏళ్లగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు నలబాల శ్రీనివాసుడు పాల్గొన్నారు.

లాభాల్లో అర్బన్ బ్యాంకు

నరసాపురం : నరసాపురం కో-ఆపరేటివ్ అర్బన్ సొసైటీ బ్యాంకు 2024-25 సంవత్సరానికి రూ.90 లక్షలు లాభంలో ఉందని సొసైటీ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి జి.జోసఫ్‌పాల్ తెలిపారు. సొసైటీ మహాజన సభ శుక్రవారం కార్యాలయ భవనంలో నిర్వహించారు. బ్యాంకు డిపాజిట్స్ రూ.25.29 కోట్లకు చేరాయని జోసఫ్‌పాల్ తెలిపారు. బ్యాంకు ద్వారా రూ.25.35 కోట్లు రుణాలు ఇచ్చామని చెప్పారు. రూ.8 కోట్లు వరకు జాతీయ బ్యాంకుల్లో నిల్వలున్నాయని వివరించారు. 2024-25 సంవత్సరానికి సభ్యులకు 8 శాతం డివిడెండ్ ప్రకటించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మజ్జి



పాలకొల్లు సెంట్రల్: పట్టణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మజ్జి వీర వెంకట సత్య వరప్రసాద్ ఏకగ్రీవంగా ఎంపికైనట్టు ఎన్నికల అధికారి రాపాక ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం పట్టణ బార్ అసోసియేషన్‌లో నిర్వహించిన సమావేశంలో వర ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా వీర జయ రామాంజనేయులు, జనరల్ సెక్రటరీగా చక్రవర్తి గణేష్, జాయింట్ సెక్రటరీగా ప్రసన్న కుమార్, లైబ్రరీ సెక్రటరీగా పామర్తి నగేష్, ట్రెజరర్ బొడ్డుపల్లి శ్రీనివాసరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ కత్తుల సత్యనారాయణ, లేడి రిప్రజెంటేటివ్ నాగ దుర్గావతి, సభ్యులు వర్ధనపు దివాకర్, మురార్జీ రాజు,కొండేటి శ్రీనివాస్, కొప్పు కిషోర్, కోటే ఆశాజ్యోతిలను ఏకగ్రీవంగా ఎంపికయ్యారని ప్రభాకర్ తెలిపారు. వీరి పదవీకాలం 2025 – 26 మార్చి వరకు కొనసాగుతుందన్నారు.

ఎన్‌సీసీ ప్రవేశాల ఎంపిక పక్రియ


స్వర్ణాంధ్రలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ ప్రవేశాల ఎంపిక పక్రియ

నరసాపురం రూరల్ : నరసాపురం మండలం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో 2025-ఎన్‌సీసీ ప్రవేశాల కార్యక్రమం శుక్రవారం కళాశాలలో నిర్వహించారు. 7 (ఏ) నావెల్ యూనిట్ వారి ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపిక పక్రియకు లెఫ్టినెంట్ కమాండర్ చిట్టి రోహిత్ కుమార్ అధ్యక్షత వహించారు. విద్యార్థులకు శరీర దారుఢ్య, రాత, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ముఖాముఖి ద్వారా 18 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ముఖ్యఅతిథులుగా లెఫ్టినెంట్ సంజిత్ రౌత్రాయ్, కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కె.వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అద్దాల శ్రీహరి, ప్రిన్సిపాల్ ఎస్ సురేష్ కుమార్, కళాశాల కేర్ టేకర్ ఆఫీసర్ విస్సా మాణిక్యాలరావు, 7 (ఏ) నావెల్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యంతో అభ్యసించండి

విద్యార్థులు ఇష్టపడి లక్ష్యంతో విద్యను అభ్యసిస్తే అనుకున్న లక్ష్యాలను సులువుగా సాధించవచ్చునని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలం నరసాపురం మండలం సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ, బీబీఏ, బీసీఏ కోర్సుల విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్ సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మి అలంకరణలో దుర్గమ్మ దర్శనం

యలమంచిలి: దసరా శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా బూరుగుపల్లి గ్రామంలోని కనకదుర్గమ్మవారి విగ్రహంతోపాటు మండపాన్ని శుక్రవారం రూ.40లక్షల కరెన్సీ నోట్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక్కడ కనకదుర్గమ్మ మూలవిరాట్టుకే ప్రతి ఏడాది పూజలు చేయడం ఆనవాయితి.

లక్ష్మీదేవి నమోస్తుతే

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. కుంకుమ పూజలు చేశారు. రాత్రి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక చినగోపురం వీధిలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అమ్మవారు వైష్ణవి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. యడ్ల బజారు సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో ఉదయం నుంచి భక్తులు కుంకుమ పూజలు చేశారు.

స్కందమాతగా..

నరసాపురం: పట్టణంలోని పండ్ల మార్కెట్ వద్ద అమ్మవారు స్కందమాతాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గడ్డిబజార్ కనకదుర్గ, రాయిపేట కనకదుర్గమ్మ, రాయిపేట పుంతలో ముసలమ్మ, గోదావరి గట్టు కొండాలమ్మ, చనమామిడిపల్లి నాగారమ్మ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

మహాలక్ష్మీదేవిగా..

నరసాపురం రూరల్: ఎల్బీచర్ల గ్రామంలో కటకంశెట్టి వారి వీధిలో అమ్మవారిని మహాలక్ష్మిదేవిగా అలంకరించారు. సారవ గ్రామంలో ముత్యాలమ్మ ఆలయంవద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కె.బేతపూడి దుర్గాదేవి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కొప్పర్రు సెంటరు, లిఖితపూడిలోని ధానేశ్వరి, లక్ష్మణేశ్వరంలోని గోగులమ్మ, మొగల్తూరు మండలం ఆకనవారి తోటలో అమ్మవార్లకు విశేష పూజలు చేశారు.

కుంకుమార్చనలు

పెనుగొండ: పెనుగొండ, ఆచంట మండలాల్లో వాడవాడలా కనకదుర్గమ్మ ఆలయాల వద్ద మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. పెనుగొండలో నగరేశ్వర మహిషాసుర మర్దని వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్దని, మూలవిరాట్ వాసవీ మాతలను, అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలోనూ అమ్మవార్లు లక్ష్మీదేవి అలంకరణలో పూజలు, అభిషేకాలు అందుకున్నారు. సిద్ధాంతం దేవీ సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

- పెనుమంట్ర: పెనుమంట్ర కనకదుర్గమ్మ మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నెగ్గిపూడిలో కనకదుర్గమ్మ, వనుములమ్మ, వారాహి అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో పూజలు అందుకున్నారు. మార్టేరులో కనకదుర్గమ్మ నిత్యం ప్రత్యేక అలంకరణలో పూజలు చేస్తున్నారు.


పెనుగొండ : మరకతశిల వాసవీ మాత


నరసాపురం రూరల్ : ఎల్బీచర్ల కటకంశెట్టివారి వీధిలో మహాలక్ష్మి


నరసాపురం రూరల్ : మొగల్తూరు ఆకనవారితోటలో అమ్మవారు


పెనుమంట్ర : నెగ్గిపూడి కనకదుర్గమ్మ


పెనుగొండ : మహిషాసురమర్దని


పెనుగొండ : వాసవీ మాత


నరసాపురం : స్టీమర్‌రోడ్డు అమ్మవారు


ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీ వైష్ణవిదేవి


నరసాపురం : రాయిపేట కనకదుర్గమ్మ


పెనుమంట్ర : మార్టేరులో స్వర్ణచీరతో కనకదుర్గమ్మ


నరసాపురం రూరల్ : కె.బేతపూడి అమ్మవారు


క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి


యలమంచిలి : బూరుగుపల్లి కనకదుర్గమ్మ


పెనుమంట్ర : కనకదుర్గమ్మ